క్లుప్తంగా

వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెండు వినతులు మాత్రమే వచ్చాయి. కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ మేరకు పన్నులను సకాలంలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఈఈ టి. రాయల్‌బాబు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీప్లానర్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రూ. 34 లక్షలకు ఆశీల వేలంపాట ఖరారు



సహాయ కమిషనర్ అప్పలరాజు చాంబర్‌లో నిర్వహిస్తున్న వేలంపాట

విజయనగరం: నగర పాలక సంస్థ పరిధిలో రోడ్డు మార్జిన్ ఆశీలు వసూలు చేసేందుకుగాను సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన వేలంపాట రూ. 34 లక్షలకు ఖరారైంది. రానున్న ఆర్థిక సంవత్సరంలో ఆశీలు వసూలు చేసేందుకు రూ. 23.50 లక్షలు ప్రభుత్వ పాటగా నిర్వహించగా.. 34 లక్షల రూపాయలకు గేదెల చంద్రశేఖర్ పాట ఖరారు చేసుకున్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

'క్రాస్‌ప్రోగ్రాం'ను సద్వినియోగం చేసుకోవాలి..

నెల్లిమర్ల: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు నిర్వహిస్తున్న క్రాస్‌ప్రోగ్రాంను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. పాడైన బోరుబావులు, రక్షిత మంచినీటి పథకాలకు మరమ్మతులు చేపడతామన్నారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే సలహా మండలి సభ్యులు అంబళ్ల శ్రీరాముల నాయుడు, ఎంపీడీఓ రామకృష్ణరాజు, ఏఓ సుదర్శనం, తదితరులు పాల్గొన్నారు.

నియామకం..



లెంక తవుడు

నెల్లిమర్ల: ఏపీ రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘ జాయింట్ సెక్రటరీగా లెంక తవుడు ఎన్నికయ్యారు. ఈయన ప్రస్తుతం నెల్లిమర్ల మండలం కొండగుంపాం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే నెల్లిమర్ల మండల కార్యదర్శుల సంఘ అధ్యక్షుడిగా ఉన్నారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన తవుడును ఎంపీడీఓ రామకృష్ణరాజు, ఈఓపీఆర్‌డీ శంకర జగన్నాథం, కార్యాలయ ఏఓ సుదర్శనం, మండల కమిటీ ప్రధాన కార్యదర్శి బంగార్రాజు, తదితరులు అభినందించారు.

వైఎస్సార్‌సీపీ యువత పోరు రేపు

- పోస్టర్లను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ



యువత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పార్టీ నాయకులు

డెంకాడ: ఈ నెల 12వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో యువత పోరు నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని చింతలవలసలో వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, వైఎస్సార్‌సీపీ నాయకులు యువత పోరు పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనేక హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలన్న సంకల్పంతో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టారని చెప్పారు. దీంతో ఎంతోమంది పేద విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి, ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని గుర్తు చేశారు. అదే బాటలో ఆయన కుమారుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కూడా పథకాన్ని కొనసాగించి, విద్యార్థులకు అండగా నిలిచారని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నీరుగారుస్తోందని ఆరోపించారు. ప్రతి ఏటా 20 లక్షల ఉద్యోగాల కల్పన, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులను మోసం చేసిన కూటమి ప్రభుత్వపై వైఎస్సార్‌సీపీ యువత పోరు పేరుతో ఈనెల 12న అన్ని కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరాడ కోటినాయుడు, లెంక లక్ష్మణరావు, పతివాడ కృష్ణవేణి, పిన్నింటి సత్యారావు, ఎర్ర శ్రీనివాసరావు, బి.రమాదేవి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అభినందనలు



దివ్యాంగ జంటలను ఆశీర్వదిస్తున్న ఇన్‌చార్జ్ జేసీ ఎస్.శ్రీనివాసమూర్తి, తదితరులు

విజయనగరం అర్బన్: ఆదర్శ వివాహం చేసుకున్న రెండు దివ్యాంగ జంటలను ఇన్‌చార్జ్ జేసీ ఎస్.శ్రీనివాసమూర్తి సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆశీర్వదించారు. గజపతినగరం మండలం కెంగువ గ్రామానికి చెందిన చింతా నారాయణ, రాజపులోవకు చెందిన శ్రీసత్య.. ఎస్‌కోట మండలం వెంకటరమణపేటకు చెందిన వెంట సత్యాచారి, నెల్లిమర్ల మండలం పూతికపేటకు చెందిన విజయలక్ష్మి ఇటీవల వివాహం చేసుకున్నారు. ఆదర్శ వివాహాలు చేసిన విజయదుర్గా దివ్యాంగుల సంక్షేమ సంఘం, హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సంఘాల గౌరవ అధ్యక్షులు డి.కొండబాబు, సత్యనారాయణ, ప్రసాద్, రమ్య, తదితర ప్రతినిధులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షలు ఎప్పుడు?

- డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం

విజయనగరం గంటస్తంభం: కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ ఎగ్జామ్స్ నిర్వహించి పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 20 వేల పోస్టులను భర్తీ చేయాలని విజయనగరం కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌కు డీవైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ సీహెచ్.హరీష్, నిరుద్యోగులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో 2022 నవంబర్ 28న పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు 2023 జనవరి 22న ప్రాథమిక రాత పరీక్ష నిర్వహించగా..95,208 మంది అర్హత సాధించారని చెప్పారు. ఆ తరువాత కోర్టు కేసులు, ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం 2024 డిసెంబర్ 22నుంచి జనవరి 16వరకు దేహదారుఢ్య, శారీరక సామర్థ్యం పరీక్షలు నిర్వహించారు. ఆ తరువాత మెయిన్స్ ఎగ్జామ్స్ గురించి ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో దాదాపు ఆరు సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న అభ్యర్థులు పగలు, రాత్రనక, రీడింగ్ రూమ్‌ల్లో చదువుకుంటూ, రూమ్, కోచింగ్ అద్దెలు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని..పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, లక్ష్మణ, పాల్గొన్నారు.

అపరాల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జేసీ శ్రీనివాసమూర్తి

విజయనగరం ఫోర్ట్: అపరాలకు (పెసర, మినుము) సంబంధించి కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జ్ జేసీ శ్రీనివాసమూర్తి తెలిపారు. సోమవారం రాత్రి తన చాంబర్‌లో అపరాల కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్వింటా మినుము ధర రూ. 7400, పెసలు క్వింటా ధర 8682 రూపాయలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు, మార్క్‌ఫెడ్ డీఎం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించండి..

విజయనగరం అర్బన్: ప్రభుత్వ, జిల్లా పరిషత్, స్థానిక సంస్థల డ్రైవర్లకు కేటాయించిన ఇళ్ల స్థలాలను సభ్యులకు అప్పగించాలని ప్రభుత్వ డ్రైవర్ల మ్యూచ్‌వల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ సభ్యులు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..జిల్లా కేంద్ర సమీపంలోని వేణుగోపాలపురంలో మూడెకరాల స్థలం కేటాయించారని, ఇంతలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ జరగలేదన్నారు. ప్రస్తుతం కోడ్ ముగిసిన నేపథ్యంలో లబ్ధిదారులకు స్థలాలు కేటాయించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు ఎ.అప్పలనాయుడు, కోశాధికారి వి.మధుసూధనరావు, తదితరులున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు సామాజిక పెన్షన్

విజయనగరం అర్బన్: ఆర్టీసీలో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు సామాజిక పెన్షన్ వర్తింపచేయాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ సభ్యులు స్థానిక డీపో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. పాలనలోకి వచ్చి పది నెలల కావస్తున్నా రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వ పట్టించుకోలేదని ఆరోపించారు.

పనిభారం తగ్గించాలి



డెంకాడ : ఎంపీడీఓ భవానీకి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

డెంకాడ: పంచాయతీ కార్యదర్శులపై పని భారం తగ్గించాలని పలువురు ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ భవానీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. వివిధ రకాల సర్వేలు, ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలు అమలు చేస్తూ పంచాయతీ కార్యదర్శులు ఒత్తిడి లోనవుతున్నారన్నారు. కనీసం సెలవు రోజులు కూడా వినియోగించుకోలేక పోతున్నారని చెప్పారు. 13 రకాల సర్వేలతో పాటు పంచాయతీ ద్వారా నిర్వహించాల్సిన పనులెన్నో ఉన్నాయని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి పని ఒత్తిడి తగ్గించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

నెల్లిమర్ల: ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని నెల్లిమర్ల మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ రామకృష్ణ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో పని ఒత్తిడి ఎక్కువ కావడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శుల సంఘ అధ్యక్షుడు లెంక తవుడు, ప్రధాన కార్యదర్శి కె. బంగార్రాజు, వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

17న ధర్నా

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయ సీనియారిటీ నమోదులో చోటుచేసుకున్న తప్పులను సవరించాలని కోరుతూ ఈ నెల 17న డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు యూటీఎఫ్ జిల్లా కమిటీ ప్రకటించింది. ఈ మేరకు కమిటీ సభ్యులు డీఈఓ మాణిక్యం నాయుడును సోమవారం కలిసి నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో కె.విజయగౌరి, కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రాస్‌ప్రోగ్రాం వాహనం ప్రారంభం..



వేసవిలో నీటిఎద్దడి నివారణకు క్రాస్‌ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాగునీటి బోర్లు, రక్షిత మంచినీటి పథకాల మరమ్మతులకు మండల పరిషత్ నుంచి నిధులు మంజూరు చేశామన్నారు. ఈ నెల10వ తేదీ నుంచి మే ఐదో తేదీ వరకు క్రాస్‌ప్రోగ్రాం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. రాధిక, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ జ్ఞానేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమంత్‌కుమార్, ప్రజాప్రతినిధి మహంతి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. – పూసపాటిరేగ

వైభవంగా పూర్ణాహుతి



సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకుని వేకువజామున స్వామివారికి ప్రాతఃకాలార్చన, బాలభోగం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించి .. యాగశాలలో రామాయణంలోని పట్టాభిషేక సర్గ విన్నపం చేశారు. అనంతరం పూర్ణాహుతి జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, పవన్, రామగోపాలాచార్యులు పాల్గొన్నారు. – నెల్లిమర్ల రూరల్

వినతి..



పంచాయతీ కార్యదర్శులపై పని ఒత్తిడిని తగ్గించాలని మండల పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడు కె.ఎర్నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.రాధికను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు సత్యనారాయణ, భూషణ్, సంతోష్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు. – పూసపాటిరేగ





పోలిపల్లి పైడితల్లి



భోగాపురం కనకదుర్గ

ఘనంగా అమ్మవార్ల జాతర

పూసపాటిరేగ: భోగాపురం మండలం పోలిపల్లి గ్రామంలో పైడితల్లి అమ్మవారి జాతర ఘనంగా ప్రారంభమైంది. సోమవారం ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి పది గంటల వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పోలిపల్లిలో సందడి వాతావరణం నెలకొంది. అలాగే భోగాపురం మండల కేంద్రంలో కనకదుర్గమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. భోగాపురంతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికంగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

కనులపండువగా శ్రీనివాసుని కల్యాణం



శ్రీనివాసుని కల్యాణంలో పూజలు చేస్తున్న దంపతులు ఎస్పీ వకుల్‌జిందల్, కమాండెంట్ మలికాగార్గ్, తదితరులు

డెంకాడ: చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి 41వ వార్షిక కల్యాణ మహోత్సవం సోమవారం సాయంత్రం కనులపండువగా నిర్వహించారు. శ్రీవారు,అమ్మవార్ల తరపున ఎస్పీ వకుల్ జిందల్, ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ మలికా గార్గ్ దంపతులు కూర్చుని స్వామివారి కల్యాణం జరిపించారు. వేద మంత్రోచ్చారణల నడుమ జరిగిన కల్యాణంలో మండలంలోని పలు గ్రామాలతో పాటు విజయనగరం, పద్మనాభం మండలాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ పూజలు

శ్రీనివాసుని కల్యాణోత్సవంలో భాగంగా నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులకు మాజీ ఎమ్మెల్యేకు స్వామివారి ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరాడ కోటినాయుడు, పతివాడ కృష్ణవేణి, బి.రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణంలో పాల్గొన్న భక్తులు